# వాస్తవం
డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

శనివారం
14.02.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## కారు స్పీడ్ తక్కువే..

కార్పొరేషన్లలో జీరో

16 మునిసిపాలిటీల్లో 17 మాత్రమే



9లో..

# హస్తం హవా



## పురపోరు..కాంగ్రెస్ జోరు

9లో..

74 మునిసిపాలిటీలు, 4 కార్పొరేషన్లలో విజయబావుటా..24 మునిసిపాలిటీల్లో నెలకొన్న హంగ్..వీటిలోనూ అత్యధికం ఎంఐఎం, స్వతంత్రుల మద్దతు, ఎక్స్ అఫీషియో ఓట్లతో కాంగ్రెస్‌కే దక్కే చాన్స్

17 చోట్ల బీఆర్ఎస్‌కు మెజారిటీ, బీజేపీకి 'సున్నా'

వడ్డేపల్లి మునిసిపాలిటీని దక్కించుకున్న ఫార్వర్డ్ బ్లాక్


నిజామాబాద్, కరీంనగర్, కొత్తగూడెం కార్పొరేషన్లలో హంగ్!..ఎంఐఎంతో కలిసి నిజామాబాద్, సీపీఐతో కలిసి కొత్తగూడెం కార్పొరేషన్లను అధికార పార్టీ దక్కించుకునే అవకాశం..ఉత్తరం నుంచి దక్షిణ తెలంగాణ దాకా హస్తం హవా..రెండో స్థానంలో బీఆర్ఎస్.. పరిమితంగానే బీజేపీ ప్రభావం



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2,582 వార్డులకు గాను 2,581 వార్డుల ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో 1,349 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో 74 మున్సిపాలిటీలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. ఇక బీఆర్ఎస్ 718 వార్డుల్లో గెలుపొందింది. దాంతో 17 మున్సిపాలిటీలను ఆ పార్టీ దక్కించుకుంది.

## ఓ కాంగ్రెస్ ప్రభుత్వమా! మా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఎక్కడా?

### బ్యాలెట్ బాక్స్‌లో లెటర్ ప్రత్యక్షం



ఓ కాంగ్రెస్ ప్రభుత్వమా!

మేము రిటైర్మెంట్ అయి 15 నెలలు గడిచింది. మాకు రావలసిన, మీరు చెల్లించాల్సిన డబ్బులు ఏ ఒక్క పైసా కూడా రాలేదు. ఇవ్వలేదు అనేక ఇబ్బందులు పడుతూ, అనారోగ్యం పాలవుతూ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం చేయించుకోలేక ఇప్పటి వరకు 62 మంది చనిపోయారు. అందుకే బాధతో మేము చనిపోక ముందే మా డబ్బులు మాకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాము.

**మున్సిపల్** ఎన్నికల కౌంటింగ్ వేళ కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి బయటపడింది. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించకుండా రేవంత్ సర్కార్ చేస్తున్న జాప్యంపై నిరసన తెలుపుతూ బ్యాలెట్ బాక్స్‌లో ఓ లెటర్ ప్రత్యక్షమైంది. ఓ కాంగ్రెస్ ప్రభుత్వమా.. మా రిటైర్‌మెంట్స్ బెనిఫిట్స్ ఎక్కడా అంటూ అందులో పెన్షనర్లు ప్రశ్నించారు.సూర్యాపేట మున్సిపాలిటీలోని 47వ వార్డులోని బ్యాలెట్ బాక్స్‌లో ఓట్లను లెక్కిస్తుండగా ఈ లెటర్ బయటపడింది. అందులో.. " ఓ కాంగ్రెస్ ప్రభుత్వమా! మేం రిటైర్‌మెంట్ అయ్యి 15 నెలలు గడిచింది. మాకు రావాల్సిన, మీరు చెల్లించాల్సిన డబ్బులు ఏ ఒక్క పైసా కూడా రాలేదు. ఇవ్వలేదు. అనేక ఇబ్బందులు పడుతూ, అనారోగ్యం పాలవుతున్నాం. ఆస్పత్రిలో మెరుగైన వైద్యం చేయించుకోలేక ఇప్పటివరకు 62 మంది చనిపోయారు. అందుకే బాధతో మేం చనిపోక ముందే మా డబ్బులు మాకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం" అని ఆ లేఖలో ఉంది. ఈ లెటర్ ఇప్పుడు వైరల్‌గా మారింది.

90 శాతం గెలవకుంటే..

## అదో గెలుపా?

అధికారంలో ఉండి.. ఆ మాత్రం గెలవకపోతే ఎలా? : కేటీఆర్

ప్రధాన ప్రతిపక్షంగా మేం సఫలమయ్యాం

9లో..




అధికారంలో ఉన్న పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 80-90 శాతం స్థానాలు గెలవకపోతే అది గెలుపు ఎలా అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గతంలో మునిసిపల్ ఎన్నికలు జరిగితే మొత్తం 130 మేయర్లు, చైర్ పర్సన్లకు బీఆర్ఎస్ పార్టీ 122 స్థానాలు గెలిచిందని గుర్తు చేశారు.

## జెండా మోసిన కార్యకర్తలకే ఈ విజయం అంకితం

ఈ విజయం నా బాధ్యతను మరింత పెంచింది

మునిసిపల్ ఎన్నికల్లో విజయంపై సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 13 : మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అఖండ విజయం లభించడంతో తన బాధ్యత మరింత పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల ప్రజా పాలన, పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ ఆమోదం తెలిపారని శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొ న్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ భవిష్యత్తులో ప్రతి మునిసిపాలిటీ, కార్పొరేషన్‌ను గొప్పగా అభివృద్ధి చేసి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. "రాష్ట్రంలోని 7 మునిసిపల్ కార్పొరేషన్లు, 116 మునిసిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లో కాంగట?గ్రకు అఖండ విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కా ర్యకర్తల శ్రమ ఫలితం. పార్టీ పట్ల వారికున్న అనంతమైన అభిమానానికి నిదర్శనం. పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల దరి చేర్చిన ప్రతి కార్యకర్తకూ ఈ విజయాన్ని అంకితమిస్తున్నాం" అని సీఎం తెలిపారు.

# మరిపెడ మునిసిపల్ పీఠం కాంగ్రెస్‌దే

- 9వార్డుల్లో కాంగ్రెస్
- 5 వార్డుల్లో బీఆర్ఎస్
- ఒక వార్డులో ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం
- క్యాంపునకు తరలిన అధికార పార్టీ కౌన్సిలర్లు

**వాస్తవం : మరిపెడ**

హోరా హోరీగా జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పై చేయి సాధించింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ పీఠంపై జెండా ఎగురవేసింది. 15 వార్డులకు 9వార్డులు కైవసం చేసుకుని విజయ ఢంకా మోగించింది. శుక్రవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 5, ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించారు. కాగా అధికార పార్టీ అభ్యర్థులు క్యాంపునకు తరలివెళ్లారు. కాంగ్రెస్ విజయంతో మరిపెడ పట్టణంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. రాంచంద్రు నాయక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచి పట్టం కట్టిన డోర్నకల్, మరిపెడ పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

**గెలుపొందిన అభ్యర్థుల వివరాలు..**

1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఇస్లావత్ తిరుపతి 74 ఓట్ల మెజార్టితో గెలుపొందగా, 2వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి బానోత్ భద్రమ్మ శ్రీను 116 ఓట్లు మెజార్టీ, 3వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పానుగోత్ రాములు 20 ఓట్లు, 4వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మెరుగు రాము 58 ఓట్లతో, 5వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి బోడ భాస్కర్ 48 ఓట్లు, 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కాలం సునీత రవీందరెడ్డి 151 ఓట్లు, 7వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మండం కాంతమ్మ 117 ఓట్ల, 8వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి 6 ఓట్లు, 9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గుగులోత్ నీల లచ్చిరాం 111 ఓట్లు, 10వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి బాదావత్ బేబీశ్రీ రవి 39 ఓట్లు, 11వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి లావుడియా సత్యవతి 176 ఓట్లు, 12వ వార్డు స్వతంత్ర అభ్యర్ది గంట్ల గౌతం రెడ్డి 252 ఓట్లు, 13 వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి గంట్ల సుజాత మహిపాల్ రెడ్డి 68 ఓట్లు, 14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్ది జాటోత్ సురేష్ 151 ఓట్లు, 15వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి లూనావత్ రమేష్ 216 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.


1వ వార్డు ఇస్లావత్ తిరుపతి కాంగ్రెస్

**ఇండిపెండెంట్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ..**

పోటీ పోటీ ఎన్నికల్లో 12వ వార్డు తరపున బరిలో నిలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి ఏసీ గుర్తుతో గంట్ల గౌతమ్ రెడ్డి మరిపెడలోనే అత్యధికంగా 252ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

## వేములవాడ మున్సిపల్ చైర్మన్ గిరి

# మున్నూరు కాపులకేనా?

- ఎంపీ, ఎమ్మెల్యే కూడా కాపులే
- మున్సిపాలిటీ ఏర్పడిన రెండుసార్లు మున్నూరు కాపులకే పదవి
- ఒక్కసారి అవకాశం కావాలంటూన్న పద్మశాలి కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ

**వాస్తవం : వేములవాడ ఆర్సీ**

రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలతో పోలిస్తే వేములవాడకు ప్రత్యేక గుర్తింపు ఉంది. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరి స్వామి క్షేత్రం తెలంగాణ రాష్ట్రంలోని వేములవాడలో ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పవిత్ర స్థలం రాజన్న ఆలయంలో జరిగే ప్రతి ముఖ్యమైన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్‌ను ఆహ్వానించడం ఆనవాయితీ. దీంతో ఏది ఏమైనా సరే మున్సిపల్ చైర్మన్ పదవి దక్కించుకోవాలని చాలామంది ఉత్సాహంగా ఉన్నారు. గత ఎన్నికల్లో బీసీ మహిళ కావడంతో ఎక్కువగా పోటీ లేకపోయింది కానీ ప్రస్తుతం బీసీ జనరల్ అవడంతో పోటీ తీవ్రమైంది.వేములవాడ మున్సిపల్ పరిధిలో 28 కౌన్సిలర్ స్థానాలు ఉన్నవి. గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా మారిన తర్వాత మొదటిసారి మున్నూరు కాపుకు చెందిన నామాల ఉమ చైర్మన్ చేశారు గత చైర్మన్ పదవి కూడా బిఆర్ఎస్ పార్టీకి చెందిన మున్నూరు కాపు సామాజిక వర్గం నుండి రామతీర్థం మాధవి పదవి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం జరిగిన ఎన్నికల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ నుండి 13 మంది, బిజెపి నుండి 08 మంది, బిఆర్ఎస్ నుండి 05 మంది ఇండిపెండెంట్లు ఇద్దరు కౌన్సిలర్లు గెలుపొందారు. దీంతో ఆధిక్యం ఉన్న కాంగ్రెస్ పార్టీ 13 స్థానాలు ఇద్దరు ఇండిపెండెంట్లు ఒక్క బిఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో వేములవాడ మున్సిపల్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠం దక్కించుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా గెలిచిన 13 మందిలో పుల్కం రాజు,కాస శ్రీనివాస్, కొండ రాజశేఖర్ ,ఇప్పపూల మమత, తోట రాజు మున్నూరు కాపు సామాజిక వర్గానికి కు చెందిన వారు వీరిలో పుల్కం రాజు, ఇప్పపూల మమత చైర్మన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈసారి కూడా మళ్లీ మున్నూరు కాపులే చైర్మన్ పదవి కైవసం చేసుకోవాలని ఆశయంతో ఉన్నారు. దీంతో ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గం శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్నూరు కాపులైన పుల్కం రాజు, ఇప్పపూల మమత లకు ఒకరికి చైర్మన్ గిరి అప్పగిస్తారా ? వేములవాడ ప్రాంత పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్, స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కూడా మున్నూరు కాపు వాసులే. దీంతో వేములవాడ చైర్మన్ పదవి కూడా మున్నూరు కాపులే కైవసం చేసుకోంటారని చర్చలు నడుస్తున్నాయి. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్కు సంబంధించిన కౌన్సిలర్లు అందరూ కూడా క్యాంపుకు వెళ్లారు. ఏది ఏమైనా 16వ, తారీఖున జరిగే చైర్మన్ ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే.




## వెబ్ కాస్టింగ్ సెంటర్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**వాస్తవం: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ సెంటర్‌ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు.సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలోని సినారె కళా మందిరాల్లో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, వెబ్ కాస్టింగ్ సెంటర్ ద్వారా పరిశీలించారు. సెంటర్ లోని సిబ్బందికి సూచనలు చేశారు.ఈ పరిశీలనలో కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, శ్రావణ్, ఈడీఎం శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



### మున్సిపల్ కౌంటింగ్ సెంటర్‌ను

## పరిశీలించిన జిల్లా ఎస్పీ

**వాస్తవం : వేములవాడ:**

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని సినారె కళామందిరాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం,గెలిచిన అభ్యర్థులు,వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు నిర్వహించడం,డీజే కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, టపాకాయలు కాల్చడం, భారీగా గుంపులు,గుంపులుగా గుమి కూడటం, ఫం క్షన్ హాల్స్‌లో సమావేశాలు ఏర్పాటు చేయ డం పూర్తిగా నిషేధం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, జిల్లా అధనవు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్ర చారి ,టౌన్ సిఐ వీరప్రసాద్, రూరల్ సిఐ శ్రీనివాస్,సిబ్బంది పాల్గొన్నారు.



# బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఉమామహేశ్వర ఆలయం

### ఈనెల15 నుంచి 19 వరకు వైభవంగా ఉత్సవాల నిర్వహణ

**మార్కుక్ : వాస్తవం:**

మండలంలోని అంగడికిష్టాపురం గ్రామంలో కొలువుదీరిన ప్రాచీన శ్రీఉమామహేశ్వర స్వామివారి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ కొండల్ రెడ్డి, ఆలయ చైర్మన్ బల్లి శ్రీనివాస్, ఆలయ ధర్మకర్త గుండం భట్ల వెంకట నర్సింహా శర్మ వెల్లడించారు. సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దేవాలయం కాకతీయ నిర్మాణ శైలిలో నిర్మితమై, శివ భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర మాఘ బహుళ త్రయోదశి (మహాశివరాత్రి) సందర్భంగా ఆదివారం (15-02-2026) బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపన, అంకురార్పణ వంటి వైదిక కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. సాయంత్రం సామూహిక రుద్రాభిషేకాలు, రాత్రి నందివాహన సేవ, హారతులతో భక్తులను అలరించనున్నారు. 16వ తేదీన అభిషేకాలు, హవనాలు, త్రిశూల స్థాపన వంటి కార్యక్రమాలు జరుగుతాయి. 17వ తేదీన ధ్వజారోహణం, దేవతాహ్వానం, స్వామివారి కళ్యాణ మహోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సాయంత్రం గజవాహన సేవ, భద్రకాళీపూజ, అగ్నిగుండ ప్రవేశం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 18వ తేదీన శ్రీరామ సత్యనారాయణ స్వామి వ్రతం, రాత్రి రథోత్సవం భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. 19వ తేదీన చక్రతీర్థం,పూర్ణాహుతి, ఋత్విక్ సన్మానం, మహదాశీర్వచనం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. రాత్రి ఏకాంత సేవ, హారతితో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని, పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు తన, ధన, మన రూపేణ సహకరించి స్వామి కృపకు పాత్రులుకావాలని ఆలయ పురోహితులు బ్రహ్మశ్రీ గుండంభట్ల వెంకట నర్సింహా శర్మ, సృజన్ శర్మ కోరారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని దేవాలయ కమిటీ, ఉమామహేశ్వర సేవా ట్రస్టు సభ్యులు, గ్రామ ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు.

### బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు పూర్తి

**భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**

**సర్పంచి కొండల్ రెడ్డి**



గ్రామంలో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సర్పంచ్ కొండల్ రెడ్డి తెలిపారు. ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరిగే ఈ ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, వాహనసేవలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు కూడా చేపట్టినట్లు చెప్పారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని కమిటీలు సమన్వయంతో పని చేస్తున్నాయని సర్పంచ్ కొండల్ రెడ్డి పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు.





## సీఎం కప్ కబడ్డీ పోటీల్లో మార్కుక్ జట్టుకు రెండవ స్థానం



**ఉత్తమ ప్రతిభ చాటిన యువకులకు ఘన సత్కారం**

**మార్కుక్ : వాస్తవం:**

గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ కబడ్డీ పోటీల్లో మార్కుక్ మండల జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి తాలూకా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. పలు మండలాల నుంచి పాల్గొన్న జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో మార్కుక్ క్రీడాకారులు సమిష్టి ఆటతీరు, చురుకుదనం ప్రదర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం మార్కుక్ సర్పంచ్ బుల్లె రాణి మల్లేశం, ఉప సర్పంచ్ సాయిని మహేష్ క్రీడాకారులను శాలువలతో సత్కరించి అభినందించారు. గ్రామ స్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తే యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని వారు పేర్కొన్నారు. భవిష్యత్‌లో రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు కల్పనా రాజు, నాయ కులు సుధాకర్ రెడ్డి, పాండు, భాస్కర్ క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు తైక్వాండో బాలికల ఎంపిక



**వాస్తవం : కోనరావుపేట**

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు తైక్వాండో బాలికలు ఎంపికైనట్లు కోచ్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో సీఎం కప్ పోటీలలో కోనరావుపేట మండలం కనగర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పుట్ట శరణ్య,మోతె వైష్ణవిలు పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో తైక్వాండో కోయర్గి లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. ఈనెల 18, 19న హైదరాబాదులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన బాలికలను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి రాందాస్, హెచ్ఎం వినోద్ కుమార్, సర్పంచ్ స్వామిదాస్‌లు అభినందించారు.

## ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

**ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**

**మార్కుక్ : వాస్తవం:**




నైటింగేల్ ఆఫ్ ఇండియాగా ఖ్యాతి పొందిన సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్‌గా సేవలందించిన సరోజినీ నాయుడు సేవలను ఉపాధ్యాయులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్కిట్స్, నాటికలు, ఉపన్యాసాలు, రోల్‌ప్లే ప్రదర్శనలు, క్విజ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఉపాధ్యాయురాలు వందన, ఉపాధ్యాయులు ఆర్ శ్రీనివాసరావు, ఎం రమణారావు, పి పద్మా రెడ్డి,ఏ నాగేశ్వరరావు, డి కృష్ణ, పౌజియా, మాధవి, బి.కవిత, పి కవిత,ఎస్ డి మునీర్, ఏ శ్రీలత విద్యార్థులు ఉన్నారు.



# అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ విజయకేతనం

### మెజార్టీ స్థానాలు గెలుపొంది చైర్మన్ కైవసం

**వాస్తవం : అందోల్**

అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయ కేతనం ఎగరవేసింది. గత 15 రోజులుగా నిద్రహారాలు మాని ప్రచారం చేసిన పలు పార్టీల నాయకులు ఊపిరిపీల్చుకున్నారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులో గాను 16 వార్డులలో కాంగ్రెస్ మూడు మూడు వార్డులలో టీఆర్ఎస్ ఒకటి ఇండిపెండెంట్ గెలుచుకున్నాయి. ఇందులో ఒకటో వార్డు నుండి గడ్డి అరుణ్( కాంగ్రెస్), రెండవ వార్డ్ నుండి కోసికే రాజశేఖర్( కాంగ్రెస్) , మూడవ వాడు నుండి మఠ్రి అరుణకుమారి( కాంగ్రెస్) , నాలుగో వార్డ్ నుండి కల్పన హరి కృష్ణ గౌడ్( కాంగ్రెస్) , ఐదవ వార్డ్ నుండి కొత్త గొల్ల మాధవి శ్రీనివాస్( కాంగ్రెస్), ఆరవ వార్డు నుం డి రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్( కాంగ్రెస్) , ఏడవ వార్డు నుండి తోట్ల రామకృష్ణ( కాంగ్రెస్), ఎనిమిదవ వార్డు నుండి భవాని నాగరత్నం గౌడ్ (టిఆర్ఎస్) , 9వ వార్డు నుండి శోభ నారాయణ గౌడ్ (టిఆర్ఎస్) , పదవ వార్డు నుండి పట్లోళ్ల రేఖ ప్రవీణ్ (కాంగ్రెస్) , 11వ వార్డు నుండి కల్పనా నాగరాజ్( కాంగ్రెస్) , 12వ వార్డు నుం డి కోరబోయిన సరస్వతి( కాంగ్రెస్) , 13వ వార్డు నుండి పట్లూరి శివశేఖర్ (టిఆర్ఎస్) , 14వ వార్డు నుండి ఊర్మిళ దుర్గేష్ (ఇండిపెండెంట్), 15వ వార్డు నుండి ఆకుల చిట్టిబాబు (కాంగ్రెస్) , 16వ వార్డు



నుండి పట్లోళ్ల శ్రీనివాస్( కాంగ్రెస్) , 17వ వార్డు నుండి మేఘావత్ మేఘా రాణి (కాంగ్రెస్) , 18 వ వార్డు నుండి బేగరీ శశిరేఖ అనిల్ (కాంగ్రెస్) , 19వ వార్డు నుండి అల్లే మంజుల శ్రీకాంత్ (కాంగ్రెస్) , 20వ వార్డు నుండి కృష్ణారెడ్డి (కాంగ్రెస్)లు గెలు పొందారు. గెలిచిన వారికి వార్డు ప్రజలు నాయకులు కార్య కర్తలు అభినందనలు తెలియ జేశారు. మిఠాయిలు పంచుకున్నారు.

---

# తిరుమలగిరి మున్సిపల్ పీఠం బీఆర్ఎస్‌దే

### ముందే చెప్పిన వాస్తవం దిన పత్రిక సర్వే
### చైర్మన్‌గా అపర చాక్యుడు సంకెపల్లి రఘునందన్ రెడ్డి
### కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకుడు లేడు అన్నది మరోసారి రుజువు

**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కాంగ్రెస్ మధ్య జరిగిన హోరాహోరి పోరులో అధికార పార్టీ పై బిఆర్ఎస్ ఊహించని విధంగా విజయదంకా మోగించింది. కాంగ్రెస్ పార్టీ పై ప్రజల్లో కల్పిన తీవ్ర వ్యతిరేకత ప్రతిపక్ష బి ఆర్ ఎస్ పార్టీకి కలిసిచ్చిందన్నది వాస్తవం. కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకుడు లేదు అన్నది మరోసారి రుజువైంది. మున్సిపాలిటీ ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కును వినియోగించు కున్నారు. ప్రజలు ఆపదలో అం డగా నిలిచే వ్యక్తులకే పట్టం కట్టారు. మరోసారి దమ్మున్న లీడర్ ఎవరు అనే విషయం స్పష్టమైందన్నది వాస్తవం. ఏదేమైనా మున్సిపల్ పోరులో మొత్తం పదిహేను వార్డుల కు గాను అధికార కాంగ్రెస్పార్టీ కనీసం ఎక్స్ ఆఫీషియో ఓట్లను ఉపయోగించే అవకాశం లేకుండా కేవలం అయిదు స్థానాలకే పరిమితం అవ్వడం నాయకత్వ లోపంగా చెప్పొచ్చును. చైర్మన్ నేనంటే నేను అని చెప్పుకున్న అభ్యర్థులు ఒక్కరు కూడా గెలవలేదు. ఏదేమైనా.! తిరుమలగిరి మున్సిపాలిటీ పీఠం ప్రతిపక్ష బిఆర్ఎస్ సొంతం చేసుకుంది. అభ్యర్థుల ప్రకటన మొదలుకొని ప్రచారంలో కూడా ముందంజలో కారు దూసుకొని పోయిందన్నది వాస్తవం. తిరుమలగిరి మున్సిపాలిటీ పదిహేను వార్డులకు గాను 10 వార్డులు బి ఆర్ ఎస్, 5 వార్డులు, అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్నాయి.

**పోటీ చేసిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయ్...**

1వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పనికిరే లక్ష్మి 519 ఓట్లతో గెలుపు.

2వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జక్కుల రమేష్ 435 ఓట్లతో గెలుపు

3వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కారుపోతుల సోమలక్ష్మి 522 ఓట్లతో గెలుపు.

4వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బత్తుల శకుంతల 394 ఓట్లతో గెలుపు.

5వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తిరుమని యాదగిరి 438 ఓట్లతో గెలుపు.

6వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేషిడి కవిత 509 ఓట్లతో గెలుపు.




7వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తుల శ్రీనివాస్ 503 ఓట్లతో గెలుపు.

8వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిలుక వెన్నెల 542 ఓట్లతో గెలుపు.

9వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కన్నెబోయిన మల్లయ్య 560 ఓట్లతో గెలుపు.

10వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భూక్యా యాకుబ్ నాయక్ 402 ఓట్లతో గెలుపు.

11వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏమోజు గోవిందమ్మ 586 ఓట్లతో గెలుపు.

12వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కందుకూరి గీత 414 ఓట్లతో గెలుపు.

13వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సంకెపల్లి జ్యోతి 361ఓట్లతో గెలుపు.

14వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సంకెపల్లి రఘునందన్ రెడ్డి 430 ఓట్లతో గెలుపు.

15వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పత్తెపురం త్రిశుల్ 441 ఓట్లతో గెలుపొందారు.

# మంజీరా నదిలో ఇసుక దొంగల వాహనాలు పట్టివేత

**వాస్తవం : మద్నూర్ :**

కామారెడ్డి జిల్లా మద్నూర్ డోంగ్లి ఉమ్మడి మండలంలోని అటు పోతంగల్ మండలాల మధ్యలో గల మంజీర నదిలో ఇసుక మాఫియా కొనసాగుతుంది. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక దొంగలను పట్టుకునేందుకు డోంగ్లి మండల జీవన్ ఇన్స్పెక్టర్ సాయిబాబా పాలు గ్రామాల జిపిఓలు కలిసి తనిఖీలు చేపట్టగా రెండు ట్రాక్టర్లు మరియు ఒక బులెరో పట్టుబడ్డాయి. డోంగ్లి రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిబాబా తెలిపారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో పోతంగల్ మండలం కొడిచీర గ్రామం శివారు మంజీరా నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక బులెరో వాహనం ఇసుకతో కూడిన వాహనాలను పట్టుకున్నారు. ఈ తనిఖీలలో ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. ఈ వాహనాలను డోంగ్లి తహసిల్దార్ కార్యాలయం నందు సేఫ్ కస్టడ్ కొరకు ఉంచామని వారు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో జిపి ఓలు బాల నరసయ్య, బాలయ్య, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## అన్నం మిగిలిందా....
# పారవేయకండి
## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్



**వాస్తవం : వేములవాడ**

వేములవాడ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ఒక ఫంక్షన్ నందు మిగిలిన ఆహార పదార్థాలు తీసుకుని వచ్చి స్లమ్ ఏరియాలో ఉన్న దాదాపు 100మంది అన్నార్తులకు పంపిణీ చేశారు. మీ ఇంట్లో గాని, ఫంక్షన్ లలో కానీ ఆహార పదార్థాలు మిగిలితే పారవేయక మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు గాని, ట్రస్ట్ ఫోన్ నంబర్ 92469 39388కు సమాచారం అందిస్తే తీసుకుని వచ్చి అట్టి మిగిలిన ఆ హార పదార్థాలు పేదలకు పంపిణీ చేయడం జరుగుతుందని ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ తెలిపారు.

# ఆర్థిక భద్రత మీ హక్కు

**ఎల్లారెడ్డిపేటలో వాకథాన్**

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట:**

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్.(ఆర్బీఐ) ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆర్థిక అవగాహన వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట హెడ్క్వార్టర్స్లోని బస్టాండ్ ఏరియా నుంచి ఎంపీడీవో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో మండల కేంద్రంలోని అన్ని బ్యాంకుల సిబ్బంది, ఎస్ ఎస్సి మెంబర్స్, రైతులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీలో "మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీని ఎవరితోనూ షేర్ చేయకండి – ఆర్థిక అవగాహన కలిగి ఉండండి, ఆర్థిక భద్రత మీ హక్కు" అనే నినాదా లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్డీ ఎం మల్లికార్జున రావు, ఎస్ఐ రాహుల్ రెడ్డి, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



## బాధిత గీత కార్మికుడికి
# ఎక్స్ గ్రేషియా అందించాలి



**వాస్తవం: సిరిసిల్ల**

వేములవాడ అర్బన్ మండలంలోని సంకేపల్లి గ్రామానికి చెందిన నాగుల రాజేశం గౌడ్ అనేగీత పారిశ్రామిక సహ కార సంఘ సభ్యుడు ఈనెల 11 న సాయంత్రం కల్లు తీయుటకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడి పక్కటెముకలు విరిగి ఊపిరితిత్తులకు గుచ్చు కొని తీవ్ర గాయాలతో ప్రస్తుతం కరీంనగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని పరిస్థితి చాలా విషమంగా ఉన్నందున శుక్రవారం ఆబ్కారి జిల్లా అధికారిని కలిసి ప్రభుత్వం నుండి ఎక్స్గ్రేషియా ఇప్పించి అతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంపునూరి మల్లేశం గౌడ్, నాగుల రాము గౌడ్ ఆధ్వర్యంలో యువజన విభాగం జిల్లా నాయకులు నాగుల రాజేశంగౌడ్, సొసైటీ ఉపాధ్యక్షులు వినతి పత్రం అందించారు. బాధితుడికి తక్షణం ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా అందించాలని కోరారు.

## ఘనంగా భారత కోకిల జయంతి



**వాస్తవం: చందుర్తి:** చందుర్తి మండలం సనుగుల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గాన కోకిల సరోజిని నాయుడు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కటుకూరి ముఖేష్ మాట్లాడుతూ... సరోజినీ నాయుడు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు, గొప్ప వక్త సరోజినీ నాయుడు జయంతిని నేడు దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. భారత కోకిలగా ప్రసిద్ధి చెందిన సరోజినీ నాయుడు తన కవిత్వం ద్వారా దేశభక్తి భావాలను ప్రజల్లో నింపారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆమె చేసిన సేవలు అనన్యసామాన్యమైనవి. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వ్యవహరించిన తొలి భారతీయ మహిళగా, అలాగే ఉత్తరప్రదేశ్ రాష్ట్ర తొలి మహిళా గవర్నర్గా ఆమె చరిత్ర సృష్టించారన్నారు. స్త్రీల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సరోజినీ నాయుడు జీవితం నేటి యువతకు ధైర్యం, దేశభక్తి, సేవాభావానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆశయాలను స్మరించుకుంటూ ఆమె చూపిన మార్గంలో దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఉపాధ్యాయులు మేకల పద్మ, కొరెపు శ్రీనివాస్, నాతరి నాగమణి, చింత హరిష్మా, ఎగొళం మాధవి, యాస నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి




**వాస్తవం: దౌల్తాబాద్:** ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని డిసిసిబి మేనేజర్ ఎల్లయ్య అన్నారు. శుక్ర వారం దౌల్తాబాద్ మండలం అప్పాయిపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో కేవైసీ యొక్క ప్రాముఖ్యత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు ఇతరులకు తెలుపవద్దని, తెలియని లింకులు,ఓపెన్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 18 నుండి 50 సంవత్సరాల వయసు వారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన లో చేరడం ద్వారా రూ.2 లక్షల జీవిత బీమా పొందవచ్చని, 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయసు వారు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. డిసిసి బ్యాంకులో ఉన్న స్వర్ణనిధి ప్రత్యేక డిపాజిట్ పథకం ద్వారా 444 రోజుల కాలపరి మితికి 8.25% అత్యధిక వడ్డీ లభిస్తుందని, ఇది పరిమిత కాల ఆఫర్ కావడంతో ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, పిఏసిఎస్ సీఈవో మల్లేశం, ఫీల్డ్ ఆఫీసర్ సందీప్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్, స్వామి, రమేష్, సురేష్, అశోక్ పాల్గొన్నారు.

## ఘనంగా సరోజిని నాయుడు జయంతి




**వాస్తవం: వేములవాడ :** వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గాన కోకిల సరోజిని నాయుడు147 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్ర ఫోటోకు పూలదండలు వేసి నివాళులర్పించారు. భారతీయ స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి, రాజకీయ నాయకురాలు, భారత కోకిల సరోజిని నాయుడు స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

# శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి తరలి రావాలి

**- గురు దత్త పీఠం శ్రీ కొడకండ్ల శ్రీరామ్ చరణ్ శర్మ గురూజీ**

**- అంగరంగ వైభవంగా ముస్తాబైన ఆలయం**

**- కళ్యాణ మహోత్సవానికి హాజరుకానున్న తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్ నాయుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

**వాస్తవం: దౌల్తాబాద్:**

దొమ్మాట, గాజులపల్లి గ్రామాల మధ్యలో 500 ఏళ్ల కిందట వెలిసిన పురాతన ఆలయాన్ని, పునర్నిర్మాణంతో ప్రసిద్ధి చెందబోతున్న దక్షిణ కాశీ కైలాసేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న శివ పార్వతుల కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆలయ కమిటీ చైర్మన్, గురుదత్త పీఠాధిపతి శ్రీ కొడకండ్ల శ్రీరామ్ చరణ్ శర్మ గురూజీ అన్నారు. శుక్రవారం ఆలయ క్షేత్రంలో విలేకరుల సమావేశంలో గురూజీ మాట్లాడుతూ ఈనెల 15 తేదీ ఆదివారం దొమ్మాట, గాజుల పల్లిలో కైలాసపురం ఆలయం శివభక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినాన జరిగే కళ్యాణ వేడుకలు భక్తుల్లో అపూర్వ భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా సంప్రదాయ పద్ధతుల్లో వేద మంత్రోచ్చారణల మధ్య, అర్చకుల మంగళ వాద్యాల నడుమ శివపార్వతి కళ్యాణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళ్యాణ మహోత్సవానికి ముందు ఆదివారం బ్రహ్మీ ముహూర్తం ఉదయం 4 గంటల 5 నిమిషాలకు సంతత ధార అభిషేకం,గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించడంతో పాటు భక్తుల కోసం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాల అలంకరణతో సుందరంగా ముస్తాబైందని అన్నారు.ఈ పవిత్ర వేడుకలో భక్తులు పెద్ద ఎత్తున శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని శివపార్వ



తి ఆశీస్సులు పొందాలని, కుటుంబ శాంతి, ఆరోగ్యం, సుభి క్షం కోసం ప్రార్థించాలని గురూజీ భక్తులకు విజ్ఞప్తి చేశారు. పరిసర గ్రామాల శివభక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

**తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి ఆర్ నాయుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలు రాక..**

తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి. ఆర్ నాయుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దొమ్మాట, గాజులపల్లిలో శ్రీ దక్షిణ కాశీ కైలాసేశ్వర ఆలయంలో జరిగే శివ పార్వతుల కళ్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలో పాల్గొంటారని, దొమ్మాట,గాజులపల్లి లో నిర్మాణంలో ఉన్న దక్షిణ కాశీ కైలాసేశ్వర ఆలయానికి రూ. 4 కోట్ల 60 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, ఈ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు సహకరించిన తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లి సర్పంచ్ పంజ స్వామి, దొమ్మట మాజీ సర్పంచ్ పూజిత వెంకటరెడ్డి, భక్తులు అక్కం స్వామి, ఉప సర్పంచ్ గొల్లపల్లి ప్రేమ్ కుమార్, కిషన్ పాల్గొన్నారు.

# మహాశివరాత్రి జాతరకు పోలీస్ బందోబస్తు

**ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా చర్యలు**

**పార్కింగ్,ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు**

**జాతరలో మహిళ రక్షణార్థం షీ టీమ్ బృందాలతో పహారా**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధమైన శ్రీ భీమేశ్వర ఆలయంలో ఈనెల 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర సందర్భంగా జాతరకు వివిధ జిల్లాల నుంచి బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులకు, సిబ్బందికి వేములవాడ పట్టణ పరిధిలోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో విధుల నిర్వహణపై జిల్లా ఎస్పీ మహేష్ బి గితే దిశ నిర్దేశం చేశారు.ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యా త్మిక వాతావరణంలో స్వామి వారిని దర్శించుకునేలా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 1200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు.దేవస్థానం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్ పాటించేలా చూడాలని,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిరంతరం నిఘా పోలీస్ నిఘా ఉంచాలని,ఏదైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూంకు తెలియజేయాలన్నారు.పోలీస్ అధికారులు, సిబ్బంది ఓపికతో సలహాలు , సూచనలు ఇస్తూ జాతరకు వచ్చే భక్తుల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని,ఎక్కడ కూడా అసౌకర్యం కలగకుండా అందరూ సమన్వయంతో విధులు నిర్వ




హిస్తూ మహాశివరాత్రి జాతర విజయవంతం చేయాలన్నారు.భక్తజన సందోహం ఉన్నచోట దొంగతనాలు,చైన్ స్నాచింగ్ ఇతరనేరాలు జరుగకుండా అరికట్టేందుకు క్రైమ్ పార్టీలు నిరంతరం నిఘా ఉంచాలన్నారు.జాతరలో మహిళా రక్షణార్థం షీ టీం బృందాలు కూడా సివిల్ డ్రెస్ లలో విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనపడితే అధికారులకు తెలియజేయాలన్నారు.భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున జాతరకు భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేసేలా చూడాలని,ట్రాఫిక్ ,పార్కింగ్ ప్రదేశాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ట్రాఫిక్ జామ్ అవకుండా నియంత్రణ చేయాలన్నారు.జాతరకు వచ్చే వాహనాల ద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పట్టణంలో రూట్ మ్యాప్ లు అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,రాత్రి వేళలో ప్రమాదాలు జరగకుండా స్టాపర్స్, కోన్స్, స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి, సిఐలు,ఎస్ఐలు ,సిబ్బంది పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల ప్రకటనల కోసం సంప్రదించండి 8074124190 వాస్తవం

# చేతిలో కలం ఉంటే ఏదైనా రాయొచ్చా?

## పత్రికా స్వేచ్ఛకు పరిమితులుండవా?



కేఆర్ 'శైలి' పాత్రికేయ పాఠశాల
పాఠం 14.02.2026

**విన్నది** విన్నట్లుగా, తెలిసింది తెలిసినట్లుగా, చూసింది చూసినట్లుగా పత్రికా విలేకరి రాయవచ్చా?.. అలా రాయడం అన్ని సందర్భాల్లో చట్టరీత్యా సాధ్యం కాదు. నిజాన్ని పాఠకులకు తెలియజేయడం జర్నలిస్టుల నైతిక బాధ్యత. రానీ రుజువుకు నిలవని నిజాలను చెప్పినందువల్ల కోర్టు సంబంధమైన చిక్కులు ఎదుర్కోవలసి వస్తుంది. పరువు నష్టం కేసులను ఎదుర్కోవలసి వస్తుంది.

### పరువు నష్టం ప్రమాదం...

' శ్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో సర్పంచ్ రూ. 50 వేల రూపాయలు అక్రమంగా సంపాదించినట్లు ఉప సర్పంచ్ ఆరోపించారు. సర్పంచ్ పదవిలో కొనసాగడానికి ఆయన అనర్హుడని, ఆయనకు గ్రామంలో ఐదుగురు స్త్రీలతో వివాహేతర సంబంధం ఉందని కూడా ఉప సర్పంచ్ ఆరోపించారు.' ఇలాంటి వార్తలను విలేకరులు తరచుగా రాస్తుంటారు. విలేకరుల సమావేశం జరిపి ఆరోపణలు చేస్తే అన్ని పత్రికలు ప్రచురిస్తాయి. ఉప సర్పంచ్ మాటలను యథాతథంగా కొందరు ప్రచురిస్తారు. ఆ ఆరోపణలను మరికొందరు తమ భాషలో మార్చి రాస్తారు.

పత్రికలకు, విలేకరులకు, మామూలు ప్రజలకు విమర్శించే హక్కు , అధికారం ఉన్నాయి. కానీ అబద్ధాలు చెప్పే అధికారం , తిట్టే హక్కు ఎవరికీ లేవు. సర్పంచ్ పనితీరును ఉపసర్పంచ్ విమర్శించవచ్చు. కానీ నిరాధారమైన నిందలు వేయడానికి వీల్లేదు. సర్పంచ్ పై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని రుజువైతే  ఉప సర్పంచ్‌తో సహా అందరిపైనా పరువు నష్టానికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాక క్రిమినల్ డిఫమేషన్ నేరానికి ప్రాసిక్యూట్ చేసి జైలుకు కూడా పంపడానికి అవకాశాలున్నాయి. ఇలాంటి వ్యాజ్యాల్లో, లిటిగేషన్లలో చిక్కుకోకుండా, విలేకరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పత్రికా స్వేచ్ఛను ఏ పరిమితులూ లేకుండా వాడితే ఎలాంటి ప్రమాదాలు ఎదురవుతాయో తెలుసుకోవాలి. మన రాతలే మనల్ని రక్షిస్తాయి..అలాగే మన రాతలే మనల్ని శిక్షిస్తాయి.

### చెప్పినవన్నీ రాయాలా?

విలేకరుల సమావేశంలో చెప్పినంత మాత్రాన ఎవరో చెప్పిన మాటలన్నీ రాయాల్సిన అవసరం లేదు. అతను చెప్పిన మాటల్లో నిజం ఎంత ఉందో, అతన్నే వివరంగా అడిగి గ్రహించాలి. చెప్పిన విషయాలు నిజాలని అనిపించకపోతే రాయాల్సిన అవసరం లేదు. నిజాలని భావించడానికి తగిన ఆధారాలను అడిగి తెలుసుకోవాలి. శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంత డబ్బు కేటాయించారు? అంచనా ఖర్చు ఎంత? రూ. 50 వేల రూపాయలు ఎక్కడ నుంచి సర్పంచ్‌కు చేరాయి.? అందుకు సాక్ష్యం చెప్పిందెవరు? లిఖిత ఆధారాలున్నాయా? రూ. 50 వేల రూపాయలు మాయం అయ్యేవరకు ఉప సర్పంచ్‌కు ఎందుకు తెలియలేదు? ఎప్పుడో గతంలో అవినీతి, అక్రమం జరిగి ఉంటే ఉప సర్పంచ్ ఇవాళే ఎందుకు చెబుతున్నారు? ఇవన్నీ నిజాలను నిగ్గు తేల్చే ప్రశ్నలు..

ఈ విధంగా ఆధారాలతో సహా వివరాలన్నీ తెలుసుకున్న తర్వాత ఆ వార్తను జాగ్రత్తగా రాయాలో , అసలు రాయవద్దో అన్నది తేల్చుకోవాలి.
ఉదాహరణకు..ఇలా...
శ్మశానవాటిక అభివృద్ధి పనుల్లో అంచనాలకు మించి ఖర్చు చేశారని ఉప సర్పంచ్ ఆరోపించారు. నాసిరకం సిమెంట్ వాడారని, ఇసుక ఎక్కువగా కలిపారని, ఇందు వల్ల ప్రజాధనం వృథా అయిందని విలేకరుల సమావేశంలో ఉప సర్పంచ్ ఆరోపించారు..ఈ విధంగా ఆధారాల్లేని ఆరోపణల తీవ్రతను తగ్గించి, అక్రమం జరిగిందేమోనన్న అనుమానాన్ని సమంజసమైన రీతిలో కలిగించడం బాధ్యతాయుతమైన వార్త రచన అనిపించుకుంటుంది. సద్విమర్శ చేశామన్న తృప్తి మిగులుతుంది. తెలిసిన విషయాన్ని ప్రజలకు చేరవేశామన్న బాధ్యతను నెరవేర్చినట్లవుతుంది. కోర్టుల్లో కేసులను ఎదుర్కొనే సందర్భంలో సరియైన రక్షణ ఏర్పర్చుకున్నట్లవుతుంది.

### పత్రికా స్వేచ్ఛ....

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం. పరువు ప్రతి వ్యక్తికి ప్రాణప్రదం. ఒక్కోసారి పరువు  ప్రాణం కన్నా ముఖ్యం. నిందలు భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ప్రతి వ్యక్తికి ప్రతిష్ట ఆస్తివంటిది. వ్యక్తిగత విషయాలు గుట్టుగా దాచుకోవడం కూడా ఒక హక్కు. ప్రతి వ్యక్తికి సగౌరవంగా జీవించే హక్కు ఉందని భారత రాజ్యాంగా ఆర్టికల్ 21లో గుర్తించింది. పరువు హక్కు, వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా, గుట్టుగా సాగించే హక్కు ఈ ప్రాథమిక హక్కునుంచే లభించాయి. వాక్ స్వాతంత్ర్యం అందరికీ ఉన్న మరో ప్రాథమిక హక్కు. భావాలను తెలిపే హక్కు ఉంది. అభివ్యక్తి స్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ అని దీన్నంటున్నాం. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అధ్యాయంలోని ఆర్టికల్ 19(1) పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ స్వాతంత్ర్యం ఇచ్చింది. వాక్ స్వాతంత్ర్యం అంటే మాట్లడటం, రాయడం, ముద్రించడం, చిత్రించడం, పాడటం ఈవిధంగా ఏ సాధనాలైనా, మార్గాలైనా ఉపయోగించి ఒకరి భావాలను మరొకరికి తెలపడం అని అర్థం. మన భావాలను చెప్పడానికే కాదు ఇతరుల భావాలను తెలపడానికి కూడా వాక్ స్వాతంత్ర్యం ఉంది. సాధారణంగా మరొకరి భావాలను, మాటలను విలేకరి పత్రికల్లో వార్తలుగా రాస్తుంటాడు. అది కూడా స్వేచ్ఛలో భాగమే. వాక్ స్వాతంత్ర్యం అన్నారే కానీ పత్రికా స్వాతంత్ర్యం అని రాజ్యాంగంలో పేర్కొనలేదు. వాక్ స్వాతంత్ర్యంలోనే పత్రికా స్వాతంత్ర్యం ఇమిడి ఉందని సుప్రీం కోర్టు కూడా అనేక సందర్భాల్లో వివరించింది. సుప్రీంకోర్టు చెప్పేది శాసనంతో సమానం. ఏదైనా ప్రచురించకుండా ఉండే హక్కు, రాయకుండా ఉండే హక్కు కూడా పత్రికా స్వేచ్ఛలో ఇమిడి ఉన్నాయి. ఫలానా వార్త వేసి తీరాలని ఒత్తిడి చేయడం, చేయకూడటం  ఈ స్వేచ్ఛకు భంగమే అవుతుంది.

### పత్రికా స్వేచ్ఛ..పరిమితులు

పత్రికా స్వేచ్ఛ అపరిమితమైనదేమీ కాదు. సమాజ శ్రేయస్సు కోసం, వ్యక్తి హక్కుల రక్షణ కోసం పత్రికా స్వేచ్ఛకు పరిమితులుంటాయి. పత్రికలో వార్తలను ప్రచురించేముందు మరెవరికో ప్రీ సెన్సార్ షిప్ ఉండటానికి వీల్లేదు. కానీ విలేకరి రాసే వార్తలో తప్పులను సరిచేసి అవసరమైన మేరకు సంపాదకుడు ప్రచురిస్తారు. దీన్ని సెన్సార్‌షిప్ అనరు. ఎడిటింగ్ అంటారు.

### రాయకూడని అంశాలు

దేశ భద్రతలకు, ప్రాదేశిక సమగ్రతకు భంగం కల్గించే వార్తలు, వ్యాసాలు విదేశాలతో మన దేశానికి ఉన్న సత్సంబంధాలు చెడగొట్టే విధంగా వార్తలు.. సమాజంలో అశాంతి రేకెత్తించే వార్తలు..అశ్లీల రచనలు, ఉద్రేకం కల్గించే రచనలు..కోర్టులను నిందించే రచనలు ..నేరాలను ప్రోత్సహించే రీతిలో రచనలుచేయకపోవడమే మంచిది

మానసాని కృష్ణా రెడ్డి
9618616110
8074124190

# టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాకు షాక్

## జింబాబ్వే సంచలన విజయం

**కొలంబో:** టీ20 వలర్డ్‌కప్(ు20 ఔశీతీశ్రీ్స జబజూ)లో సంచలన నమోదు అయ్యింది. కొలంబోలో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 రన్స్ తేడాతో జింబాంబే విక్టరీ కొట్టింది. జింబాబ్వే క్రికెటర్లు అద్భుతమైన ఆటను ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అత్యధికంగా 64 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు ఉన్నాయి. జింబాబ్వే బ్యాటర్లలో మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 రన్స్ స్కోరు చేశారు. జింబాబ్వే 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 125 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. కానీ ఆసీస్ బౌలర్లు రాణించడంతో చివరి అయిదు ఓవర్లలో జింబాబ్వేకు 44 రన్స్ మాత్రమే వచ్చాయి. జింబాబ్వే విసిరిన టార్గె ట్‌ను అందుకునే క్రమంలో ఆస్ట్రేలి యా చేతులెత్తేసింది. అనూహ్య రీతిలో ఓటమిని ఎదుర్కొన్నది. 19.3 ఓవర్లలో 146 రన్స్ చేసి ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా 65, మ్యాక్స్‌వెల్ 31 రన్స్ చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్‌బానీ 4, బ్రాడ్ ఇవాన్స్ 3 వికెట్లు తీసుకున్నారు. చేజింగ్‌లో కేవలం 29 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా. ఆ తర్వాత అయిదో వికెట్‌కు మ్యాక్స్‌వెల్, రెన్‌షా 77 రన్స్ జోడించారు. కానీ ఆసీస్ మేటి బ్యాటర్లు జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు. 4 ఓవర్లలో 17 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్న ముజరబానీ .. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అతను వంద వికెట్లు తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు.



# భీమన్న ఆలయంలో మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు

## ఈవో రమాదేవి పర్యవేక్షణ

**వాస్తవం : వేములవాడ ఆర్ సి ఇంచార్జ్**

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. జాతర రోజుల్లో భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉండటంతో క్యూ లైన్లు, త్రాగునీటి సదుపాయం, చలువ పందిళ్లు, పార్కింగ్ సౌకర్యాలు సమకూర్చుతున్నారు. పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేసిన శివార్చన వేదిక, లడ్డూ సత్రం, అన్నదా



న సత్రాల నిర్వహణపై కూడా ఈవో ప్రత్యేకంగా దృష్టి సారించారు. భక్తులకు అందించే ప్రసాదాలు నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు. మహాశివరాత్రి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ కౌన్సిలర్,ఇండిపెండెంట్ అభ్యర్థులు

**కండువా కప్పిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**వాస్తవం : వేములవాడ ఆర్ సి ఇంచార్జ్**

మున్సిపల్ ఎన్నికల్లో విజయదంకా మోగించిన కాంగ్రెస్ పార్టీ లో చేరికల పర్వం కొనసాగుతుంది.. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో గెలుపొందిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నరాల శేఖర్,ఇండిపెండెంట్ అభ్యర్థులు కుమ్మరి శిరీష- శ్రీనివాస్,ఆలే(టైలర్) శ్రీనివాస్లు,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి ప్రభుత్వ విప్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం రోజు రోజుకు పెరుగుతోందన్నారు.



మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ప్రజల మార్పు ఆకాంక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. అభివృద్ధి, పారదర్శక పాలన, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ఓట్ల లెక్కింపు

**వాస్తవం : సిరిసిల్ల**

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని సినారె భవన్ లో ఏర్పాటుచేసిన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమా అగ్రవాల్ పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, బలగంతో భారీ బందోబస్తు నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 39 కౌన్సిలర్ ఓట్ల లెక్కింపు నిర్వహించి అధికారులు గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరిగిందని అధికారులు వెల్లడించారు.

**సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ గిరి మళ్లీ బిఆర్ ఎస్ పార్టీ కే**

సిరిసిల్ల మున్సిపల్ రెండు పర్యాయాలు బిఆర్ ఎస్ పార్టీ చైర్మన్ గిరి కైవసం చేసుకుంది. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39 వార్డులు ఉన్నారు. తాజా మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ మద్దతుతో 27 కౌన్సిలర్లు గెలుపొందగా మళ్లీ చైర్మన్ పదవి కైవసం చేసుకోనుంది. మాజీ





మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు మున్సిపల్ చైర్మన్ ఎంపికకు ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిసింది. ఈనెల 16 న ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఎంపిక నిర్వహించి చైర్మన్ పదవి స్వీకరణ చేయనున్నారు. మూడవ సారి మున్సిపల్ చైర్మన్ బిఆర్ ఎస్ పార్టీ చైర్మన్ గెలిపించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు సమరం నిర్వహించారు.

## వేములవాడలో రోడ్డుపై

# బైఠాయించి జర్నలిస్టులు నిరసన



**వాస్తవం : వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. వేములవాడ మున్సిపల్ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై గంట గడుస్తున్నా, ఫోటోలు మరియు వీడియోలను అధికారిక డీపీఆర్ఓ గ్రూపులో అప్‌లోడ్ చేయకపోవడాన్ని నిరసిస్తూ వేములవాడ జర్నలిస్టులు రోడ్డుపై బైఠాయించారు. వేములవాడ కౌంటింగ్ విజువల్స్ అడగగా, సిరిసిల్ల కౌంటింగ్ వీడియోలు వాడుకోవాలంటూ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంపై జర్నలిస్టులు తీవ్ర అసహనానికి గురయ్యారు. అధికారుల వైఖరిని తప్పుపడుతూ,వారి వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టులు నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కౌంటింగ్ కేంద్రం వెలుపల సమాచారం కోసం ఎదురుచూస్తున్న తమకు కనీస సహకారం అందించకపోవడమే కాకుండా, ఫోన్ చేసినా స్పందించకపోవడంపై మండిపడుతున్నారు. వార్తల సేకరణలో అధికారుల నిర్లక్ష్యం వీడాలని,తక్షణమే వేములవాడ కౌంటింగ్ అప్‌డేట్స్ అందించాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సమస్యలపైన ఆరా తీసిన

# మాగంటి సునీత గోపీనాథ్



**వాస్తవం : జూబ్లీహిల్స్**

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మా గంటి సునీత గోపీనాథ్ శుక్రవారం జూబ్లీహిల్స్ ని యోజకవర్గం లోని డివిజన్ల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో వారి క్యాంపు కార్యాలయంలో ( గణపతి కాంప్లెక్స్ సమీపంలో ఉన్న) సమావేశ మయ్యారు. నియోజకవర్గంలోని సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసు కుని వాటిని అధికారులచే పరిష్కరించే విధంగా మీ ప్రయత్నం ఉండాలని వారిని కోరారు. బస్తీలలో తిరిగి స్థానిక సమస్యలను తెలుసుకునే విధంగా మీరు కృషి చేయాలని ముఖ్య నాయకులను కోరారు. ఈకార్యక్రమంలో అన్ని డివిజన్ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

# ఆందోల్ జోగిపేటలో అంబరాన్నంటిన కాంగ్రెస్ సంబరాలు

## మంత్రి దామోదర్ రాజనర్సింహ

**వాస్తవం ఆందోల్**

అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ విజయ బేరి మోగించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దీనికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై అక్కడ చౌరస్తా లోని మహాత్మా బసవేశ్వర స్వామి,బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిన సందర్భంగా పార్టీ కార్యకర్తలతో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీ లోని మొత్తం 20 వార్డులలో తొలిసారిగా మంత్రి దామోదర్ రాజనర్సింహ నాయకత్వం లో 16 వార్డులలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ సాధించి చరిత్ర సృష్టించిన సందర్భంగా బాణాసంచా కాల్చి, డప్పులతో,పార్టీ కార్యకర్తలు డ్యాన్స్‌లు చేస్తూ,తమ ఆనందాన్ని పంచుకున్నారు. ర్యాలీలో కార్యకర్తల సంబరాలు, ఆనందోత్సవాలు మిన్నంటాయి. భారీ ర్యాలీలో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్య



క్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కారు స్పీడ్ తక్కువే..




**కార్పొరేషన్లలో జీరో**
**116 మునిసిపాలిటీల్లో 17 మాత్రమే**

**హైదరాబాద్, ఫిబ్రవరి 13:**

మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మునిసి పాలిటీల్లో ఎన్నికలు జరగ్గా కారు పార్టీ 17 మునిసిపాలిటీలనే కైవసం చేసుకోగలిగింది. మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్1527 వార్డులను గెలుచుకుంటే బీఆర్ఎస్ 774 వార్డుల్లో విజయం సాధించింది. చాలా చోట్ల రెండో స్థానానికి, కొన్నిచోట్ల మూడో స్థానానికే పరిమితమైంది. కార్పొరేషన్లలో ఒక్కటీ దక్కలేదు. నిజామాబాద్ కార్పొరేషన్‌లోని 60 వార్డుల్లో బీఆర్ఎస్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది. నల్లగొండ, మహబూబ్‌నగర్, రామగుండం, కరీంనగర్ కార్పొరేషన్లలో ప్రభావం చూపలేకపోయింది. మక్తల్, కోసిగి, ధర్మపురి, భైంసా మునిసిపాలిటీల్లోనైతే ఖాతా తెరవలేకపోయింది. ఆత్మకూరు, పెద్దపల్లి, నందికొండ, కొడంగల్, మంథని, మదిర, వడ్డేపల్లి, సుల్తానాబాద్, యాదగిరిగుట్ట, ఎల్లారెడ్డి మునిసిపాలిటీల్లో ఒక్కో వార్డునే గెలుచుకుంది. అయితే ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, తూప్రాన్, గడ్డపోతారం, గుమ్మడిదల వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ తన రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకుంది. దుబ్బాకలోని 20 వార్డులలో 11 స్థానాల్లో చేర్యాల మునిసిపాలిటీలో 12 వార్డులకు గాను 7 స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది గడ్డిపోతారం మునిసిపాలిటీలో 18 వార్డులకు గాను బీఆర్ఎస్ 14 స్థానాలు దక్కించుకొంది. గుమ్మడిదలలో 22 వార్డుల్లో 15 స్థానాలు, ఇస్నాపూర్‌లో 26 వార్డులకుగాను 12, జిన్నారంలో 20 వార్డులకు గాను 8 వార్డుల్లో గెలిచి గులాబీ పార్టీ తన బలాన్ని చాటుకుంది.

**గజ్వేల్, సిరిసిల్లలో గెలుపు ..**

మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నగజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని గజ్వేల్ మునిసిపాలిటీలో 20 వార్డులకుగాను 11 స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది మెదక్ మునిసిపాలిటీ 32 వార్డుల్లో బీఆర్ఎస్ 15 స్థానాలను, తూప్రాన్‌లో 16 స్థానాల్లో 9 స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుంది. కేటీ ఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజక వర్గంలోని సిరిసిల్ల మునిసిపాలిటీలో 39 వార్డుల కుగాను 27 వార్డులను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది.

---

**90 శాతం గెలవకుంటే..**

# అదో గెలుపా?

**హైదరాబాద్, ఫిబ్రవరి 13 :** అధికారంలో ఉన్న పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 80-90 శాతం స్థానాలు గెలవకపోతే అది గెలుపు ఎలా అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గతంలో మునిసిపల్ ఎన్నికలు జరిగితే మొత్తం 130 మేయర్లు, చైర్ పర్సన్లకు బీఆర్ఎస్ పార్టీ 122 స్థానాలు గెలిచిందని గుర్తు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా సఫలమైందని తెలిపారు. శుక్రవారం మునిసిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇంకా రెండుమూడేళ్లు కొనసాగే అవకాశం ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు అధికార పార్టీకే అనుకూలంగా వస్తాయని అన్నారు. అలాంటి స్థానిక ఎన్నికల్లో గెలిచి తమకు తిరుగులేదన్నట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. 'నిజంగా నీ ప్రభుత్వంపైనీకు అంత నమ్మకం ఉంటే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రండి.. ఆ 10 చోట్ల మీరు గెలిస్తే నిజంగానే దానిని ఒక ఇండికేటర్‌గా పరిగణిద్దాం' అని సీఎంకు సవాల్ విసిరారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్, కేసీఆర్ లాంటి నేతలే ఎన్నికల్లో ఓడిపోయారని, మునిసిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్ అభ్యర్థులు అధైర్యపడవద్దని సూచించారు. నేనే రాజు, నేనే మంత్రి అని విర్రవీగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లు కూడా ఎందరో వచ్చారు, పోయారని.. ఎవరూ శాశ్వతం కాదని వ్యాఖ్యానించారు. ప్రజా చైతన్యాన్ని తక్కువ అంచనా వేసిన నేతలెవరైనా గాలికి పోతారని అన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో సీపీఐకి బీఆర్ఎస్ మద్దతిస్తుందని ప్రకటించారు.

**మునిసిపల్ తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు: హరీశ్**

మునిసిపల్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ అప్రజాస్వామిక పాలనకు చెంపపెట్టు అని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి,



మంత్రులు, యావత్ ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటై బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపును అడ్డుకోవాలని చూశారని ఆరోపించారు. డబ్బు రాజకీయాలు, బెదిరింపులు, ప్రభుత్వ యంత్రాంగం అండతో కాంగ్రెస్ సాగించిన అక్రమాలను ఎదిరించి బీఆర్ఎస్ శ్రేణులు సత్తా చాటాయని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. దాదాపు 700లకు పైగా వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించడం మామూలు విషయం కాదని, రేవంత్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి ఇది నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

---

**మున్సిపల్ ఎన్నికలు..**

# సత్తా చాటిన హస్తం పార్టీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 13:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2,582 వార్డులకు గాను 2,581 వార్డుల ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో 1,349 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో 74 మున్సిపాలిటీలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. ఇక బీఆర్ఎస్ 718 వార్డుల్లో గెలుపొందింది. దాంతో 17 మున్సిపాలిటీలను ఆ పార్టీ దక్కించుకుంది. ఇక 25 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. బీజేపీ అభ్యర్థులు 260 వార్డుల్లో గెలుపొందారు. స్వాతంత్ర అభ్యర్థులు.. 254 వార్డుల్లో విజయం సాధించారు. అయితే నారాయణ్‌పేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మరణించారు. దీంతో ఆ వార్డు ఎన్నిక జరగలేదు. అందువల్ల 2581 వార్డుల ఫలితాలను ప్రకటించారు. 38 మున్సిపాలిటీల్లో మాత్రం ఏ పార్టీకి పూర్తి స్థాయి మెజార్టీ రాలేదు. దీంతో హంగ్ ఏర్పడింది. మహబూబ్ నగర్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకుంది. అలాగే జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి మద్దతుదారులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచి అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం గమనార్హం.

**కార్పొరేషన్లలో సైతం హస్తం హవా..**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రామగుండం, మంచిర్యాల, నల్గొండ, కొత్తగూడెం కార్పొరేషన్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఇక కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ తన సత్తా



చాటింది. మహబూబ్‌నగర్ స్థానం సైతం కాంగ్రెస్ పార్టీ దక్కించుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. మరో వైపు ఓటర్లు స్పష్టమైన తీర్పు ఇవ్వకపోవడంతో.. నిజామాబాద్ కార్పొరేషన్‌లో హంగ్ ఏర్పడే అవకాశం ఉందంటున్నారు. కార్పొరేషన్లలో కాంగ్రెస్ 4, బీజేపీ 1, రెండింటిలో హంగ్ ఏర్పడనుంది.

---

# కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

**వాస్తవం, బెల్లంపల్లి, ఫిబ్రవరి 13:**

బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియా జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్రవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కౌంటింగ్ పూర్తవుతున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చి ఫలితాల తీరును విశ్లేషించారు. అనుమతి లేకుండా వచ్చిన మాజీ ఎమ్మెల్యే చిన్నయ్యను పోలీసులు బయటకు వెళ్లాలని సూచించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య పోలీసులతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. అంతలోనే ఏసిపి రవికుమార్ చిన్నయ్యను కౌంటింగ్ కేంద్రం బయటకి పంపారు.



అదే సమయంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించేందుకు వచ్చారు. తమకు అనుమతించని పోలీసులు ఎమ్మెల్యే వినోద్ ను లోపలికి ఇలా అనుమతిస్తారని మాజీ ఎమ్మెల్యే చిన్నాయన తోపాటు బి ఆర్ ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బి ఆర్ ఎస్ నాయకులను దూరంగ చెదరగొట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను ఎన్నికల కౌంటింగ్ కేంద్రం నుండి బయటికి పంపాలని బీఆర్ఎస్ నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో ఎమ్మెల్యే గడ్డం వినోద్ కౌంటింగ్ కేంద్రం నుండి బయటకు వచ్చి కారెక్కి వెళ్లిపోయారు.

---

# ట్రాక్టర్ కిందపడి యువకుడు మృతి

**డి హీరేహాళ్ ఫిబ్రవరి 13**

మండలంలోని హిర్దేహాల్ గ్రామ సమీపంలో ప్రమాద వశాత్తు ట్రాక్టర్ కిందపడి లక్ష్మణ్28 అనే యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది పోలీసులు స్థానికులు తెలిపినందుకు హిర్దేహాల్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తూ ఉండేవాడని ఈ తరుణంలోని శుక్రవారం సాయంకాలం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో గ్రామ సమీపంలోనూ తోటలో పనులు ముగించుకొని తిరిగి ఇంటికి బయలుదేరుతున్న సమయంలో తానే సొంతంగా డ్రైవింగ్ చేస్తూ శుక్రవారం సాయంకాలం 7 గంటల సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడిపోవడం జరిగినది ఈ ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది విషయం తెలుసుకున్న ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకోవడం జరిగింది.తల్లి వనజాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.


సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి
సంపాదకత్వం,సారథ్యంలో
నీతిని వీడకుండా
నిజాన్ని కప్పిపుచ్చకుండా
ఉన్నది ఉన్నట్లుగా
5ఏండ్లుగా
నిరాటకంగా వెలువడుతూ
రెండు తెలుగు రాష్ట్రాల్లో
అశేష పాఠాకాదరణ పొందిన
నిఖార్సయిన
తెలుగు డిజిటల్ దినపత్రిక
వాస్తవం మీడియాకు
ఖాళీల మేర విలేకర్లు కావలెను

విలేకర్లు కావలెను
వాస్తవం




వివరాలకు..
9618616110
8074124190

వాస్తవం డెయిలీ.ఇన్
ఉన్నది ఉన్నట్లుగా
డిజిటల్ పత్రిక